సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



ఆ రూ.25 కోట్లు వచ్చేనా?

ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి మంజూరు చేసిన నిధులపై పాలకవర్గ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. వివరాలు 8లో ▸



విద్యా ప్రమాణాల పెంపునకు 'ఉన్నతి'

ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలను పెంపొందించేందుకు ప్రభుత్వం 'ఉన్నతి' కార్యక్రమానికి శ్రీకారం . వివరాలు 8లో ▸



సెమీ క్రిస్మస్ వేడుకలు

గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో గురువారం ముందస్తుగా సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాలకు స్థలం అన్వేషించండి

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- హుస్నాబాద్ తహసీల్దార్‌కు ఆదేశాలు

హుస్నాబాద్: పట్టణంలో మెడికల్ కళాశాల ఏర్పాటు, ఆర్టీఏ కార్యాలయాల భవన నిర్మాణాలకు సరిపడే స్థలాన్ని అన్వేషించాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని పొన్నం హామీ ఇచ్చిన విషయం విదితమే. అలాగే ప్రస్తుతం ఆర్టీఏ కార్యాలయ నిర్వహణ స్థానిక మినీ స్టేడియంలోని ఓ భవనంలో కొనసాగిస్తున్నారు. ఈ రెండింటికీ కావాల్సిన స్థలాన్ని చూడాలని సూచించారు. అలాగే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ నివసించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. మంత్రి నివాసం చుట్టూ ప్రహరీ నిర్మించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

విపంచిలో నేడు యువజన ఉత్సవాలు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని విపంచి ఆడిటోరియంలో శుక్రవారం జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి నాగేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. జానపద గీతాలు, డ్యాన్స్‌లు, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫీలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జెడ్పీ కోఆప్షన్ సభ్యుడికి మాతృ వియోగం

ములుగు(గజ్వేల్): జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం మాతృ వియోగానికి గురయ్యారు. కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆతని తల్లి జహరాబీ(94) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ములుగు ఎంపీపీ లావణ్యఅంజన్‌గౌడ్, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జహంగీర్, పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, పలువురు నాయకులు సలీంను పరామర్శించారు. తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

నర్సరీల్లో మొక్కలు పెంచండి



నారాయణరావుపేటలో నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రమేశ్

సిద్దిపేటరూరల్: హరితహారం కార్యక్రమంలో భాగంగా నర్సరీల్లో మొక్కల పెంపకానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జెడ్పీ సీఈఓ రమేశ్ అధికారులను ఆదేశించారు. గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని నర్సరీని జెడ్పీ సీఈఓ రమేశ్ పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. మొక్కలను పెంచేందుకు బ్యాగులను పంపించామన్నారు. వెంటనే బ్యాగుల్లో మట్టిని నింపి వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీధర్ శర్మ, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ స్రవంతి, తదితర అధికారులు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి పొడవును తగ్గించాల్సిందే

మిట్టపల్లిలో బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితులు

సిద్దిపేటఅర్బన్: మిట్టపల్లి శివారులో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) పొడవును తగ్గించాలని, జాతీయ రహదారి వెడల్పును 100 ఫీట్లకు పరిమితం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం గ్రామానికి చెందిన బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హన్మకొండ రహదారి కి అడ్డంగా సిద్దిపేట రైల్వే లైను వెళ్లడంతో గ్రామ శివారులో రూ.55 కోట్లతో సుమారు 1200 మీటర్ల పొడవుతో ఆర్వోబీ నిర్మిస్తున్నారని, దీని వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్ప ఎలాంటి ఉపయోగం లేదన్నారు. అలాగే జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా మొదటగా రహదారిని 100 ఫీట్ల వెడల్పుతో నిర్మించడానికి మార్కింగ్ చేసి అనంతరం 150 ఫీట్ల వెడల్పుతో నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రహదారి విస్తరణ వల్ల ఇళ్లు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు వాపోయారు.

గొడ్డుకారం.. కలెక్టర్ గరం



మధ్యాహ్న భోజనంలో గొడ్డుకారం

- మధ్యాహ్న భోజన నిర్వాహకులపై సీరియస్
- పనితీరు మారకపోతే ఏజెన్సీ మార్చాలంటూ ఆదేశాలు
- హుస్నాబాద్ మోడల్ స్కూల్ సందర్శన



విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్న భోజనంలో గొడ్డుకారం



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

హుస్నాబాద్: పట్టణంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు గొడ్డుకారంతో భోజనం పెట్టడంపై కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఈఓ కలెక్టర్‌కు సమాచారం అందించారు. గురువారం మోడల్ స్కూల్‌ను కలెక్టర్ సందర్శించి క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని విద్యార్థులు వాపోయారు. రెండు రోజుల క్రితం కూరలు వండకుండా కారంపొడి వేసి భోజనం పెట్టారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భోజన నిర్వాహకులు సమయపాలన సైతం పాటించడం లేదన్నారు. కారంపొడి భోజనం తింటే కడుపులో మంట వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం సరిగా ఉండకపోవడంతో ఇంటి నుంచే తెచ్చుకుంటున్నామని తెలిపారు.

వంట నిర్వాహకులను మార్చండి

మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదనే విషయమై కలెక్టర్ ఏజెన్సీ వారిని కలెక్టర్ ప్రశ్నించారు. మార్కెట్‌లో దొరికిన కూరగాయలను వండుతున్నామని వంట మనిషి భాగ్యలక్ష్మి సమాధానం చెప్పగా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన పద్ధతిలో వండాలనుకుంటే చేయండి లేకపోతే ఏజన్సీని మార్చాలని పాఠశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణకు తెలిపారు. ఇలా జరుగుతున్న సంఘటనల గురించి డీఈఓ, ఎంఈఓ, ప్రిన్సిపాల్ విచారణ జరిపించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంఈఓ తరుచూ పర్యవేక్షణ చేసి ఇలాంటి పరిస్థితి మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ దేశిరెడ్డి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి ఉన్నారు.

తెరపైకి కొత్త జీపీల అంశం

- అక్కన్నపేటలో కొత్తగా ఆరు పంచాయతీల ఏర్పాటుకు సిద్ధం
- నాలుగు రెవెన్యూ గ్రామాలు హుస్నాబాద్‌లో విలీనం?



జీపీగా ఏర్పాటు చేయాలని ఆందోళన చేస్తున్న ప్రజలు (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తికావడానికి పట్టుమని నెలరోజులు కూడా లేకపోవడం.. మరో వైపు ప్రభుత్వం మారిన నేపథ్యంలో కొత్త జీపీల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. అక్కన్నపేట మండలంలో మొత్తం 32 గ్రామపంచాయతీలు ఉండగా గౌరవెల్లి ప్రాజెక్టులో గుడాటపల్లి ముంపునకు గురైంది. ఈ క్రమంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 500మంది జనాభా దాటిన ఆవాస ప్రాంతాలకు, తండాలను కొత్త జీపీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేసి అప్పటి ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. మండలంలో కొత్త జీపీలుగా దుబ్బతండా గ్రామ పరిధిలోని(దాస్‌తండా), అక్కన్నపేట గ్రామ పరిధిలోని(చౌడుతండా), గండిపల్లి గ్రామ పరిధిలో (సరిరాంతండా), (అంబనాయక్‌తండా), కుందనవానిపల్లి గ్రామ పరిధిలో (చౌటకుంటతండా), రామవరం గ్రామ పరిధిలో (బంగారులొద్దితండా)ను(సేవాలాల్‌తండా) పేర్లను గ్రామాలుగా ఏర్పాటుకు అన్నీ అర్హతలు, సౌకర్యాలు ఉన్నాయని నివేదికలు పంపించారు. దీంతో ఇటీవల కొలువుదీర కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త జీపీ ఏర్పాటు అంశం తెరపైకి తీసుకొవచ్చినట్లు తెలిసింది. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరగనున్న సమావేశంలో ఆరు జీపీల పేర్లు, వాటి పూర్తి వివరాలు, మ్యాప్ తదితర సమాచారాన్ని నివేదించాలని అదనపు కలెక్టర్ కోరినట్లు ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి సాక్షితో చెప్పారు.

హుస్నాబాద్‌లో విలీనమేనా?

అక్కన్నపేట మండలంలో కొనసాగుతున్న గోవర్ధనగిరి, రేగొండ, మల్‌చెర్వుతండా, గౌరవెల్లి, బొడిగెపల్లి, జనగామ, గుబ్బడి, కేశవాపూర్, మంచినీళ్లబండ గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేశారు. కానీ తుది నోటిఫికేషన్ మాత్రం విడుదల కాలేదు. దీంతో ఈ గ్రామాలు హుస్నాబాద్‌లో విలీనం అయినట్టేనా? లేక అక్కన్నపేట మండలంలోనే కొనసాగుతాయా అనే అంశం కొలిక్కిరావల్సిన అవసరం ఉంది.

కోర్టును ఆశ్రయించిన సర్పంచ్...

గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైన గుడాటిపల్లి పరిధిలోని ఐదు గిరిజనతండాలను నందారం స్టేజీ వద్ద ప్రభుత్వం పునరావాస కాలనీ ఏర్పాటు చేసింది. అదేవిధంగా పునరావాస కాలనీ పక్కనే ఇతర కులస్తులు సుమారుగా 100కుటుంబాలు అక్కడే నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం పునరావాస కాలనీ, బంగారులొద్దితండాలను కలుపుకొని సేవాలాల్‌తండా పేరుతో కొత్త జీపీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. కానీ స్థానిక సర్పంచ్ రాజిరెడ్డి మాత్రం ఈ విషయంపై తీవ్రంగా వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించారు. గుడాటిపల్లి పేరుమీద గ్రామం ఏర్పాటుకు అభ్యంతరం ఏమిటని సర్పంచ్ రాజిరెడ్డి వాపోతున్నారు. ఈ విషయంపై బుధవారం రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లానని సర్పంచ్ రాజిరెడ్డి చెప్పారు. ఏదీఏమైనా కొత్త జీపీల ఏర్పాటు, హుస్నాబాద్‌లో విలీనం అంశాలపై త్వరలో కొలిక్కి రానున్నట్లు సమాచారం.

చలి పంజా

- గజగజ వణుకుతున్న జనం
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- కనిష్ట ఉష్ణోగ్రత 8.6 డిగ్రీలు నమోదు



దుబ్బాకలో చలి మంటలు వేసుకున్న యువకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/దుబ్బాక: జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గురువారం 8.6డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యింది. కొండపాక మండల కేంద్రంలో 8.6డిగ్రీలు, మిరుదొడ్డిలో 9.6డిగ్రీలు, చీకోడ్, పోతిరెడ్డిపేట, మునిగడపలలో 9.7డిగ్రీలు, వెంకట్రావుపేట, రేబర్తి గ్రామాలలో 10.1డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. చలి తీవ్రతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 దాటినా చలి తగ్గడం లేదు. సాయంత్రం 4గంటల నుంచే చలి తీవ్రత ప్రారంభమవుతోంది. వృద్ధులే కాకుండా యువకులు సైతం చలి నుంచి కాపాడుకోవడానికి ఉదయం, రాత్రి వేళల్లో మంటలు వేసుకుంటున్నారు. మరికొందరు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లను ఆశ్రయిస్తున్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు ముమ్మరం



వైకుంఠ ఏకాదశి వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈఓ, చైర్మన్ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో విశ్వనాథశర్మ అన్నారు. గురువారం పట్టణంలోని మోహినిపుర వేంకటేశ్వర స్వామి ఆలయంలో చైర్మన్ నగేష్ విష్ణు, వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డిలతో కలిసి ఈవో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విశ్వనాథశర్మ మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనానికి మొత్తం ఐదు క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గాంధీ చౌరస్తా నుంచి ఆలయ దారిలో మూడు క్యూలైన్‌లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్, చర్చి కాంపౌండ్, బాలుర, బాలికల హైస్కూల్ గ్రౌండ్‌లలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతకు ముందు వైకుంఠ ఏకాదశి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బంది సహకారం భేష్



సిబ్బందికి జ్ఞాపికను అందిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

దుబ్బాకటౌన్: అధికారులు, సిబ్బంది పరస్పర సహకారంతోనే అసెంబ్లీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించామని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందితో అదనపు కలెక్టర్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బాధ్యతలు సక్రమంగా నిర్వహించిన అందరికీ జ్ఞాపికలు అందించడంతో పాటు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుబ్బాక అసెంబ్లీ ఆర్ఓగా పనిచేసినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో తనకు అన్ని విధాలుగా సహకారం అందించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖలు అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పెట్టుబడి సాయం అందించండి

కొమురవెల్లి(సిద్దిపేట): రైతులకు పెట్టుబడి సాయం డబ్బులను ఖాతాల్లో వెంటనే జమచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ప్రభుత్వాని కోరారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలువగానే డిసెంబర్ 9న రైతుల పెట్టుబడి సహాయం రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారని వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్, అత్తిని శారధ, ఇస్తారి, తాడూరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ ప్లస్ గ్రేడ్



సంబురాలు నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్

సిద్దిపేట ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతి పత్తి) ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఈ మేరకు కళాశాల ఆవరణలో బాణాసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ న్యాక్ పీయర్ టీం కళాశాలను ఇటీవల సందర్శించిందన్నారు. ఈ సందర్శనలో కళాశాలలో ఏడు అంశాల వారీగా పరిశీలించారన్నారు. ఇందులో కళాశాల మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, తదితర అంశాలు 3.5 పాయింట్లతో ఏ గ్రేడ్ ప్లస్ సాధించడంలో తోడ్పడ్డాయన్నారు. ఈ గ్రేడ్ సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సుదర్శనంను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

- కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలి
- జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి
- కోర్టులో వసతుల కల్పనకు కృషి
- జిల్లా జడ్జి రఘురాం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రఘురాం

హుస్నాబాద్‌రూరల్: రాజీ మార్గంలో కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించాలని, రాజీపడితే కలిగే ప్రయోజనాల గురించి కక్షిదారులకు అవగాహన కల్పించాలని జిల్లా జడ్జి రఘురాం అన్నారు. గురువారం హుస్నాబాద్ కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయవాదులతో సమావేశమై పెండింగ్‌కేసుల పరిష్కారంపై చర్చించారు. ఈ నెల 30న జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని అందులో చాలా వరకు చిన్న చిన్న కేసులు పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలన్నారు. చిన్న చిన్న గొడవలకు కోర్టుల వరకు రావడంతో కేసులు పెరిగిపోతున్నాయన్నారు. దీంతో న్యాయ సహాయం కోసం వచ్చే వారు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. కక్షిదారులకు వివరించి రాజీ మార్గంలో పరిష్కారం చేయించాలన్నారు. జిల్లా అదనపు జడ్జి మురళీమనోహర్ మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు ఉన్న పెండింగ్ కేసులను పరిష్కరించాలంటే 300 ఏళ్లు పడుతుందన్నారు. కక్షిదారులకు కోర్టులు, చట్టాలపై అవగాహన కల్పిస్తే రాజీ పడేందుకు ముందుకు వస్తారన్నారు. హుస్నాబాద్ కోర్టుకు రోజూ 300 వరకు కక్షిదారులు వస్తారని వారికి కనీస మౌలిక వసతులు లేవని, సబ్ కోర్టు అవసరం ఉందని, న్యాయవాదులకు ఆఫీసు సౌకర్యం లేక రోడ్డు పై నిలబడాల్సి వస్తోందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్ జిల్లా జడ్జి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో హుస్నాబాద్ అదనపు జడ్జి కృష్ణతేజ్, న్యాయవాదులు సదానందం, బాకం సంపత్, రాజశేఖర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డికి వినతిపత్రం



సునీతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని కోరుతూ ఎమ్మెల్యే సునీతారెడ్డి, అదనపు కలెక్టర్ రమేశ్‌కు నర్సాపూర్ డివిజన్ పంచాయతీ కార్యదర్శులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. మెదక్‌ను రాజన్న సిరిసిల్ల జోన్‌లో కలపడం వల్ల నిరుద్యోగులు, ఉద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లాను చార్మినార్ జోన్‌లో కలిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు విడుదల చేయకముందే మెదక్‌ను చార్మినార్‌జోన్‌లో కలిపి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో చిలప్‌చెడ్ మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు జితేందర్, రవిశంకర్‌రెడ్డి, నాగరాజు, తిరుపతి, ఆనంద్, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు 'ఉన్నతి'



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా విద్యాధికారి (డీఈఓ) శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలను పెంపొందించేందుకు ప్రభుత్వం 'ఉన్నతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. భాషలో సామర్థ్యం పెంచడం, ముఖ్యంగా చదవడం, రాయడంతోపాటు విద్యార్థుల వారీగా అభ్యసన ఫలితాలను సాధించడమే ఉన్నతి లక్ష్యమన్నారు. ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు తదితరులు పాల్గొన్నారు.

కత్తి కార్తీకను కలిసిన హీరో సంపూర్ణేష్ బాబు



సంపూర్ణేష్ బాబుతో కత్తి కార్తీక

దుబ్బాకటౌన్: తెలంగాణ బర్నింగ్ స్టార్, సినిమా హీరో సంపూర్ణేష్ గురువారం బిగ్ బాస్ సీజన్–1 కో కంటెస్టెంట్, తన మిత్రురాలు కత్తి కార్తీకను దుబ్బాకలోని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరితో ఫొటోలు దిగేందుకు అభిమానులు వచ్చారు.





నిర్లక్ష్యపు తుప్పు

గ్రామాల్లోని వీధుల్లో చెత్త సేకరించడానికి ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి రెండు, మూడు చెత్త సైకిల్ బండ్లను అందించింది. కొద్ది రోజుల తర్వాత చెత్తను సేకరించడానికి ట్రాక్టర్లను కేటాయించారు. దీంతో బాగున్న సైకిళ్లను సైతం పంచాయతీ సిబ్బంది చెత్తకుప్పలో వదిలేశారు. ప్రస్తుతం అవి తుప్పు పట్టిపోయి ఎందుకూ పనిరాకుండా అయ్యాయి. చెత్తసేకరణ సైకిళ్లు నిర్లక్ష్యంగా వదిలేసిన ఈ దృశ్యం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి, ఎల్లుపల్లి, బక్రిచెప్యాల తదితర గ్రామాల్లో సాక్షి కంటపడింది.



కాంక్రీటు గూడు

సహజంగా పక్షులు వృక్షాలపై లేక చెట్ల తొర్రల్లో గూళ్లను ఏర్పాటు చేసుకుంటాయి.. కానీ, ఇక్కడ మాత్రం ఓ గుడ్లగూబ కాంక్రీటు రంధ్రంలో గూడు ఏర్పాటు చేసుకుంది. ప్రస్తుతం రహదారుల వెంట చెట్లను తొలగించి లేదా అటవీ ప్రాంతాల మధ్యలో కాంక్రీట్ నిర్మాణాలు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు చేపడుతున్నారు. పెరుగుతున్న ఈ నిర్మాణాలతో పక్షులు తమ ఆవాసాలను కోల్పోతున్నాయి. ఈ క్రమంలోనే ఓ రైల్వే అండర్‌పాస్ గోడలకు ఉన్న రంధ్రాన్ని గుడ్లగూబ ఆవాసంగా చేసుకొని ఉంటుంది. ఈ దృశ్యం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని నాంచరుపల్లి గ్రామ శివారులో కనిపించింది.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

చాణక్య నీతి శాస్త్రంపై గరికపాటి ప్రవచనాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పరమేశ్వర్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ధార్మిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24, 25వ తేదీల్లో చాణక్య నీతి శాస్త్రంపై పద్మశ్రీ చాగంటి ప్రవచనాలు పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఉంటాయని సంస్థ బాధ్యులు గ్యాదరి పరమేశ్వర్ తెలిపారు. గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవంలో అమర్‌నాథ్ అన్నదాన ట్రస్ట్ ద్వారా 40 రోజులపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రవచనాలు మూడు రోజులపాటు సాయంత్రం 5 నుంచి 8గంటల వరకు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ప్రవచనాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో తిప్ప రాజు, మధుసూదన్, రమేశ్ పాల్గొన్నారు.

టెక్ ఫెస్ట్ విజయవంతం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్ట్‌లు ప్రదర్శన



జహీరాబాద్ టౌన్: టెక్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ కుమారస్వామి



నంగునూరు(సిద్దిపేట): విజేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణం రంజోల్‌లోని శ్రీసంగమేశ్వర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సృజన టెక్ ఫెస్ట్ విజయవంతమైంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్, గజ్వేల్, నర్సాపూర్, జోగిపేట, గోమారం, మెదక్ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ ఇంజినీర్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఒక్కో కళాశాల నుంచి ఒకటి చొప్పున ఐదు ప్రాజెక్ట్‌లను ఇక్కడ ప్రదర్శించారు. జహీరాబాద్ శ్రీసంగమేశ్వర్ కళాశాలకు మొదటి బహుమతి రాగా, గజ్వేల్‌లోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలకు రెండో బహుమతి వచ్చింది. ముందుగా టెక్ ఫెస్ట్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డి. కుమారస్వామి ప్రారంభించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి టెక్ ఫెస్ట్ పోటీల్లో సిద్దిపేట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. ఇందులో భాగంగా కంప్యూటర్ అనుబంధ ఇంజినీరింగ్ విభాగంలో ప్రాజెక్ట్ వర్క్ నిర్వహించారు. పోటీల్లో జోగిపేట, మెదక్, రాజగోపాల్‌పేట, చిన్నకోడూర్ మహిళా కళాశాల విద్యార్థులు పాల్గొని వారు రూపొందించిన ప్రాజెక్ట్‌లను వివరించారు. ఇందులో రాజగోపాల్‌పేట విద్యార్థులు తయారు చేసిన (ఫిషింగ్ యూజింగ్ మిషన్ లర్నింగ్) ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే సిద్దిపేట కళాశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ జిల్లా విజేతగా నిలిచింది. కార్యక్రమంలో రాజగోపాల్‌పేట కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, సునీత, ప్రణీత, తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జిల్లా స్థాయి సాంకేతిక నైపుణ్య ఉత్సవాలను నిర్వహించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని సిరిసిల్ల, కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో డిప్లొమా సివిల్ చదువుతున్న విద్యార్థులు పాల్గొని వారి సాంకేతిక నైపుణ్యాలను పదర్శించారు. ఇంజినీర్లు తయారు చేసిన పరికరాల సందర్శనను అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు వచ్చి తిలకించారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ బి.సతీష్ కుమార్ సాంకేతిక విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లెక్చరర్లు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి 'స్మార్ట్ విలేజ్' ప్రాజెక్ట్



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న అతిథులు

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రదర్శించిన 'స్మార్ట్ విలేజ్' రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణలత తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సృజన టెక్ ఫెస్ట్ 2023 జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని సిద్దిపేట, జహీరాబాద్, మెదక్‌లోని పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రతీ కళాశాల నుంచి ఆరుగురు విద్యార్థులు తమ నమూనాలు ప్రదర్శించారు. జిల్లా స్థాయి పోటీల్లో మెదక్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన 'స్మార్ట్ విలేజ్' ప్రాజెక్ట్ ప్రథమ బహుమతి సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ రాజేందర్ రావు, నర్సాపూర్ బీవీఆర్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బాలచందు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ పుణ్యవతి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆ రూ.25 కోట్లు వచ్చేనా?

- గత ప్రభుత్వం మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు
- కానుకూర్చున్న పాలకవర్గ సభ్యులు
- చివరి అంకంలో వార్డులు అభివృద్ధి చేసుకోవాలని ఆశ
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆగిన టెండర్ ప్రక్రియ
- కొత్త ప్రభుత్వం ఇస్తుందా అనే సందేహాలు



హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ భవనం

హుస్నాబాద్: ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి మంజూరు చేసిన నిధులపై పాలకవర్గ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. గతంలో హుస్నాబాద్‌పట్టణంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ హుస్నాబాద్ పట్టణాభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఆగస్టులో జీఓ విడుదల చేసింది. ఇందులో దాదాపు 14 పనులకు సెప్టెంబర్‌లో వర్క్ అప్రూవల్ పూర్తి చేశారు. అనంతరం ఆన్‌లైన్‌లో టెండర్ ప్రక్రియకు ఆహ్వానించారు. కొన్ని కారణాల వల్ల మొదటిసారి టెండర్ ప్రక్రియను రద్దు చేయగా, రెండోసారి ఎన్నికల కోడ్ నేపథ్యంలో టెండర్ ప్రక్రియను నిలిపివేశారు.

కొత్త ప్రభుత్వం ఇచ్చేనా..?

కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేస్తుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పలు వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు ఇతర అభివృద్ధి పనులు కొంత వరకు పూర్తి చేసినప్పటికీ పూర్తి స్థాయిలో కావాలంటే మరిన్ని నిధులు కావాల్సి ఉంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది. వచ్చే ఏడాది చివరిలో మున్సిపల్ ఎన్నికల జరుగుతుండడంతో ప్రస్తుతం పాలకవర్గ సభ్యులు రూ.25 కోట్ల కోసం కాచుకూర్చున్నారు. మరో వైపు కొత్తగా నిర్మిస్తున్న మున్సిపల్ భవనం నిర్మాణానికి కొన్ని నిధులు అవసరం కాగా, వచ్చే నిధుల నుంచే మున్సిపల్ భవనంకు రూ.1.25 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో భవనాన్ని పూర్తి చేసి ఈ హయాంలోనే మున్సిపల్ భవనాన్ని ప్రారంభించుకోవాలని ప్రస్తుత పాలకవర్గం భావిస్తోంది.

మంత్రి పొన్నంపైనే ఆశలన్నీ..

రూ.25 కోట్ల నిధుల విషయంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే, ప్రస్తుత రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ పైనే మున్సిపల్ పాలకవర్గం ఆశలు పెట్టుకుంది. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులను యథావిధిగా కొత్త ప్రభుత్వం మంజూరు చేస్తుందా లేదంటే కాలయాపన చేస్తుందా అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

నిధులు వస్తాయని ఆశిస్తున్నాం



గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఆపకుండా కొత్త ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆశిస్తున్నాం. ఏ ప్రభుత్వం అయినా అభివృద్ధినే కోరుకుంటుంది. ఆన్‌లైన్‌లో టెండర్లు కూడా వేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో టెండర్ ప్రక్రియను నిలిపివేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరికి కృషి చేసి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.

– ఆకుల రజిత, మున్సిపల్ చైర్ పర్సన్, హుస్నాబాద్

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): జీవితంపై విరక్తితో ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మక్కరాజీపేటలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కాశబోయిన సతీశ్(30)కి అదే గ్రామానికి చెందిన లక్ష్మితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. బుధవారం రాత్రి ఇంట్లో భోజనం చేసిన సతీశ్ కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ఎంతసేపు అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు రాత్రంతా చుట్టుపక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. గురువారం గ్రామ శివారులోని లింగంకుంట సమీపంలోని మర్రిచెట్టుకు సతీశ్ ఉరి వేసుకొని కనిపించాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ హరీశ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..



చంద్రం (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని వీరన్నపేటలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బింగి చంద్రం(34) నాలుగేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక రోజూ మానసికంగా కుంగిపోయేవాడు. ఈక్రమంలోనే గురువారం గ్రామం నుంచి చుంచనకోట వెళ్లే దారిలో చంద్రం వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య బాలలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

రైతు దినోత్సవానికి తరలిరావాలి



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న పృథ్వీరాజ్, రైతు సమాఖ్య నాయకులు

- ఆహ్వానపత్రం ఆవిష్కరణ
- రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్

సదాశివపేట(సంగారెడ్డి): రైతు దినోత్సవ కార్యక్రమాన్ని 23వ తేదీన సదాశివపేట మండల పరిధిలోని మద్దికుంట గ్రామ పరిధిలోని రైతు వేదిక వద్ద నిర్వహించనున్నట్లు తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ తెలిపారు. గురువారం పట్టణ రైతు సమాఖ్య కార్యాలయంలో రైతు దినోత్సవ ఆహ్వానపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్, జర్నలిస్ట్ తీన్మార్ మల్లన్న, మాజీ చైర్మన్ స్కోర్ కాంగ్రెస్ నాయకులు పీ, సంగమేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు, కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చెరువులో పడి ఇద్దరు మృతి

చెరువులో పడి ఇద్దరు మృతి చెందారు. కొడిపల్లిలో మహిళ మృతి చెందగా, వట్‌పల్లిలో వ్యక్తి మృతి చెందాడు. ఈఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కొడిపల్లి(నర్సాపూర్): చెరువులో గౌరి మృతదేహం

కొడిపల్లి(నర్సాపూర్): బహిర్భూమికి వెళ్లిన మహిళ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. ఈ ఘటన కొడిపల్లి మండలం ధర్మాసాగర్‌గేట్ సమీపంలోని తాటిమీది చెరువు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తచెరువు పంచాయతీ మహ్మద్‌నగర్ గేట్ తండాకు చెందిన రమావత్ గౌరి(57) తండా పక్కన గల తాటిమీది చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లింది. ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందింది. తండాకు చెందిన మాన్‌సింగ్ ఆవులకు నీళ్లు తాగించేందుకు చెరువు వద్దకు వెళ్లగా నీళ్లలో మృతదేహం కనిపించింది. వెంటనే గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త రంజాలాల్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలస్యంగా వెలుగులోకి..

వట్‌పల్లి(అందోల్): చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన అందోల్ మండల పరిధిలోని పోసానిపేట గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంట గోపాల్ (40) ఈ నెల 19వ తేదీన మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. బంధువులు ఎంత వెతికినా గోపాల్ ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు గోపాల్ భార్య సంపూర్ణ జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు సాయంత్రం గ్రామ శివారులోని తామర చెరువు సమీపంలో గోపాల్ బట్టలు ఆరబెట్టినట్లు కనిపించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి చెరువు వద్దకు వెళ్లి వెతికారు. అయినా ఆచూకీ దొరక్కపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. గురువారం ఉదయం చెరువులో శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.



గోపాల్ (ఫైల్)

తాళం వేసిన ఇళ్లలో చోరీ

తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. గురువారం రెండు ఇళ్లలో బీభత్సం సృష్టించారు. పటాన్‌చెరులోని చైతన్యనగర్‌లో, జోగిపేటలోని అందోల్ గ్రామంలో ఇళ్లలో చొరబడి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు.



పటాన్‌చెరులో చిందరవందరగా వస్తువులు

పటాన్‌చెరు టౌన్: తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి నగదు, బంగారం ఎత్తుకెళ్లిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు చైతన్యనగర్ కాలనీకి చెందిన పెయింటర్ లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తెల్లాపూర్‌లో ఉండే అత్తగారింటికి వెళ్లి, గురువారం ఉదయం ఇంటికొచ్చాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 10 తులాల బంగారం,10 తులాల వెండి, రూ. 10 వేల నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటి ఎదుట ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లుగా సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యింది. బాధితుడు లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.75 వేల నగదు, బంగారం అపహరణ

జోగిపేట (అందోల్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చొరబడి నగదు, బంగారం చోరీ చేసిన ఘటన అందోల్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అందోల్‌కు చెందిన కాటిఘర్ సుభాష్ తన కొడుకు అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తూ అక్కడే ఉన్నాడు. బుధవారం రాత్రి సుభాష్ ఇంటి తాళాలను గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి బీరువాలోని రూ. 75 వేల నగదు, రెండున్నర తులాల బంగారం, రెండు వెండి ప్లేట్లు ఎత్తుకెళ్లారు. ఇంటికి ఉన్న సీసీ కెమెరాలను పగులగొట్టి, సీసీ ఫుటేజీ యూనిట్‌ను తీసుకెళ్లారు. గురువారం ఇంటికొచ్చిన సుభాష్ తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి జోగిపేట పోలీసులకు సమాచారాన్ని అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.